
# అదృష్టం




"ఉన్నోడు చేస్తే రసికత్వం,
లేనోడు చేస్తే రంకుతనం"
అన్నాడో మహానుభావుడు సమాజం స్వభావాన్ని విశ్లేషిస్తూ.

* * *

లచ్చి చలాకీ పిల్ల.

దాని వయస్సు స్వీట్ సిక్స్టీన్ దాటి నాలుగేళ్ళయింది. పెళ్ళై రెండేళ్ళయింది. పెళ్ళవడంవలన సంవత్సరం సరిగ్గా తిరగకముందే అమ్మ అయింది. అమ్మ అయినా దాని ఒళ్ళు సడలలేదు. దాని చలాకీ తనం తగ్గలేదు. పిల్ల తల్లయినా స్వీట్ సిక్స్టీన్ లాగే తయారవుతుంటుంది. ఎంతో హుషారుగా

పని చేసుకుపోతూంటుంది.

లచ్చి మా ఇంట్లో పని పిల్ల. పని పిల్ల అనేకన్నా పెద్ద దిక్కు అనడం బాగుంటుందేమో! అంట్లు తోమడం దగ్గర్నుండి అన్నం వండడం వరకూ అన్ని పనులూ అదే చేస్తుంది.

మొట్టమొదట్లో, అంటే-రెండు సంవత్సరాల క్రితం లచ్చిని పనిలో పెట్టుకున్న తొలి రోజుల్లో మా పెద్దక్క నా సంసారాన్ని చూడ్డానికి వచ్చింది. లచ్చిని పనిలో పెట్టుకోవడం చూసి, ముఖం చిట్లించింది.

"మరీ ఇంత వయస్సులో వున్న పిల్లను పనిలో పెట్టుకోవడం మంచిది కాదే సీతాలూ! మన మొగాళ్ళ బుద్ధులు ఎప్పుడెలా పక్క తోవలు పడతాయో చెప్పలేం" అంది.

"ఛ-ఛ! మావారు అటువంటి వ్యక్తి కాదు" అన్నాను-మావార్ని గురించి గొప్పగా చెప్తూ.

"అది సర్లే సీతాలూ! మన బంగారం మంచిదైనంత మాత్రాన సరిపోతుందా? అవతల వాళ్ళు కూడా మంచోళ్ళయి వుండాలి. ఇటువంటి పట్టణాలలో ఎర్రగా బుర్రగా వయస్సులో వున్న ఆడ గుంటలు పని పిల్లలుగా వచ్చి ఎన్ని సంసారాలను కూల్చేయడం లేదు?" అంది.

"లచ్చి అటువంటి రకంలా కనబడడం లేదు అక్కయ్యా!" అన్నాను.

"నువ్వు బొత్తిగా సత్తెకాలపు దానివే సీతాలూ! నీమంచి కోరి చెబుతున్నాను-దాని మీద ఓ కన్నేసి వుంచు" అంది హెచ్చరికగా.

మా పెద్దక్క మాటలు తు.చ. తప్పకుండా పాటించాను. రెండు మూడు నెలలపాటు లచ్చిని నా లాయరు తెలివినంతా ఉపయోగించి పరీక్షించాను.

లచ్చి ప్రవర్తనలో నా కెక్కడా వెకిలితనం కనిపించలేదు. నిప్పు లాంటి మనిషని తెలుసుకుని నిశ్చింతగా వున్నాను.

ఈ రెండేళ్ళలో లచ్చి మా కుటుంబంలో ఓ వ్యక్తిగా కలిసిపోయింది.

ఆ రోజు ఆదివారం.

కోర్టుకి సెలవు కావడం వలన ఇంట్లోనే వుండిపోయాను.

ఉదయం పది గంటలయింది. లచ్చి అంట్లు తోమడం ముగించింది. అన్నం ఎసరుకు స్టౌ వెలిగించి స్టీలు పాత్రలో నీళ్ళుపోసింది.

ఆ రోజెందుకో అది ఎప్పటిలా హుషారుగా వున్నట్లనిపించలేదు.

దాని ముఖంలో విచారం గూడు కట్టుకుని వున్నట్లనిపించింది.

"ఏమే! అలా వున్నావు?" అని ప్రశ్నించాను.

నా ప్రశ్నకు లచ్చి తలెత్తి చూసింది.

దాని కళ్ళు వర్షించడానికి సిద్ధంగావున్న మేఘాల్లా వున్నాయి.

"రాత్రి మా ఆయన్ని జవా న్లొట్టుకు పోయారమ్మా!" అంది.

నేను నిట్టూర్చాను.

"బ్రాకెట్టు గొడవేనా?" అని అడిగాను.

తలూపింది లచ్చి.

దాని మొగుడు సిన్మాహాలు సెంటర్లో బ్రాకెట్టు కొట్టు నడుపు తూంటాడు. ఆ విషయం నాకు తెలియంది కాదు. రెండు మూడు సార్లు ఆ బ్రాకెట్టు వ్యాపారం మానేసి మరింకేదయినా పని మీ ఆయన్ని చూసుకోమని చెప్పమని- లచ్చికి నేను సలహా చెప్పాను. నా సలహాను అది తన మొగుడికి చెప్పిందో లేదోగాని, వాడు మాత్రం అవృత్తిని విడిచిపెట్టలేదు.

"ఆయన్ని పోలీసులు యింకా వొదిలి పెట్టలేదా?" ప్రశ్నించాను.

"లేదండమ్మగోరూ! ఇయ్యాల కోర్టులో జరిమానా ఏత్తారట. జరిమానా కడితే వొదిలేత్తా రట. జరిమానా కట్టమని సెప్పి, మా మావకి డబ్బులిచ్చి పంపించి నాను" అంది ఏడుపు కంఠంతో.

మరింక, నేనేం ప్రశ్నించలేదు.

ఆ రోజు దినపత్రికను చదువుతూ కూర్చున్నాను. స్టౌ మీద ఎసరుకు నీళ్ళు పెట్టి లచ్చి నా దగ్గరకు వచ్చింది.

"నాకు తెలవక అడుగుతాను గాని ప్లీడరమ్మగోరూ! బేకెట్టు నడిపితే ఏటి తప్పు? ఇదేం దొంగ తనవాఁ?" అని ప్రశ్నించింది.

"దొంగతనం కాదుగాని బ్రాకెట్టు కొట్టు పెట్టడం తప్పే!" అన్నాను.

"కారణం సెప్పకుండా తప్పంటే ఎట్టాగ అమ్మగోరూ?"

"బ్రాకెట్టు వలన ఎందరో నష్ట పోతున్నారు" అన్నాను.

"కొందరు వొందల కొందలు గెలుత్తున్నారు కదేటి?" అంది లచ్చి కొంటరు ఆర్గ్యుమెంటు చేస్తున్న ప్లీడరులా.

"కొందరు గెలవొచ్చు లచ్చీ! కాని, గెలిచిన వాళ్ళు వోడిన వాళ్ళ కన్నా ఎన్నో వేల రెట్లు ఎక్కువ" అన్నాను.

"అందరికీ అదురుట్టం వుండొద్దేమిటి?" అని నా ఆర్గ్యుమెంటును

కొట్టి పారేసిందది. ఇంతలో మా వారు రెండుస్టేట్ లాటరీ టిక్కెట్లను పట్టుకు వచ్చేరు.

"చూడు సీతా! ఈ దినం లాటరీ రిజల్ట్సు ఏవన్నా వచ్చాయా?" అన్నారు.

మా వారికి లాటరీల పిచ్చి వుంది.

"మీరే ఆ రిజల్ట్సేదో చూసుకోండి" అంటూ నా చేతిలోని పేపరు యిచ్చేసాను.

ఆ దినపత్రికను తీసుకుని వారు పక్క గదిలోకి వెళ్ళిపోయారు.

"ప్లీడరమ్మగోరూ! బేకెట్టు ఎడితే తప్పు అన్నారు. మరి, లాట్రీ ఎడితే తప్పు నేదేమిటి? ఆ లాట్రీకొట్టు ఎంకడ్ని జవాన్లెప్పుడూ తీసుకెళ్ళలేదేం?" అంది.

"లాట్రీలను గవర్నమెంటు నడుపుతుంది. అందుకని ఆ టిక్కెట్లు అమ్మిన వాళ్ళను పోలీసులు పట్టుకెళ్ళరు" అని చెప్పాను.

"ఇది శానా అన్నాయం ప్లీడరమ్మగోరూ! రెండూ ఏపారాలే. ఇందులో ఎవడికి అదురుట్టముంటుందో ఆడికి డబ్బు వొత్తాది. గొవర్నమెంటోడు లాట్రీల్నెట్టి సేస్తున్న పని మా ఆయన బెకెట్టెట్టి సేసే పని వొకటే" అంది లచ్చి.

ఒక విధంగా లచ్చి అర్గ్యుమెంటు కరక్టేననిపించింది. ప్రభుత్వం లాటరీల వలన వచ్చిన లాభాలను ప్రజాహిత కార్యక్రమాలకే వుపయోగిస్తుండవచ్చును గాక! అయితే, లాటరీల పేరుతో కొన్ని కోట్ల మందిని దురదృష్టవంతుల్నిగా మార్చడమే గాకుండా, వాళ్ళలో జూద మనస్తత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ విషయంలో బ్రాకెట్టులకి, ప్రభుత్వం నడుపుతున్న లాటరీలకి తేడా లేదు.

"రండి బాబు-రండి! పావలాకి పాతిక రూపాయల్ని గెలుచుకోండి. మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి" అంటూ సిన్మాహాలు సెంటర్లో అరిచే లచ్చి మొగుడు నా కళ్ళ ముందు కదిలాడు.

అదే సమయంలో- "రెండ్రూపాయలతో అదృష్టాన్ని ఆహ్వానించండి. లక్షాధికారిగా మారండి. గొప్ప అవకాశం" అని పేపర్లో తాటికాయలంతేసి అక్షరాలతో వుండే స్టేట్ లాటరీ ఎడ్వర్టయిజ్మెంట్స్ గుర్తుకు వచ్చాయి.

భారంగా నిట్టూర్చాను లచ్చిని చూస్తూ.

'గొప్పోడు చేస్తే రసికత్వం. లేనోడు చేస్తే రంకుతనం. రంకుతనం మరి తప్పు కదూ?' అనిపించింది. *